

టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లకు సామాన్య ప్రజలు డిపాజిట్లు కట్టారు. ఇళ్ల నిర్మాణాలూ దాదాపు పూర్తయ్యాయి. ఆ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తే తెలుగుదేశం పార్టీకి పేరొస్తుందని గత వైసీపీ ప్రభుత్వం అలాగే వదిలేసింది.

వైసీపీ అధికారంలోకి వచ్చాక పునాది దశలో ఉన్న టిడ్కో ఇళ్లను రద్దు చేసింది. 6288 మంది లబ్ధిదారులకు డిపాజిట్లను మాత్రం చెల్లించలేదు. అదిగో.. ఇదిగో అంటూ ఐదేళ్లూ పట్టించుకోలేదు.

అటు ఇళ్లు పూర్తయిన.. ఇటు రద్దయిన లబ్ధిదారులూ వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులే పడ్డారు. సొంతింటి కల నెరవేర్చుకోవడానికి అప్పుచేసి డిపాజిట్లు కట్టిన వీరికి వడ్డీ భారమైంది. మరోవైపు అద్దె ఇళ్లల్లోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో అటు ఇళ్ల కోసం.. ఇటు డిపాజిట్ల కోసం టిడ్కో లబ్ధిదారులు కూటమి ప్రభుత్వంవైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరు సమీపంలో పూణేపల్లె వద్ద సిద్ధంగా ఉన్న టిడ్కో గృహాలు

'టిడ్కో' లబ్ధిదారుల ఆశలన్నీ కూటమిపైనే

ఇల్లు రద్దు చేసి రూ.లక్ష డిపాజిట్ ఇవ్వలేదు



ఈమె పేరు నాగ. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లెలో నివాసం. 2018లో డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం ఈమె రూ.లక్ష డిపాజిట్ చేశారు. ఈమె ఇల్లు పునాది దశలోనే ఉందని చెప్పి వైసీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేశారు. ఆ రూ.లక్ష వెనక్కి ఇచ్చేస్తామన్నారు. నాలుగేళ్లుగా రూ.లక్ష కోసం కార్యాలయాలన్నీ తిరుగుతున్నారు. వడ్డీకి తెచ్చిన రూ.లక్ష అప్పు అలాగే మిగిలిపోయింది. ఇల్లు మాత్రం రాలేదు. ప్రస్తుతం నెలకు రూ.2 వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇళ్లు రద్దయిన 6288 మంది లబ్ధిదారుల పరిస్థితి ఇదే.

ఇదీ టిడ్కో గృహాల పరిస్థితి

- చిత్తూరు నగరంలోని పూణేపల్లె వద్ద టిడ్కో గృహ సముదాయాల్ని నిర్మించారు. టీడీపీ ప్రభుత్వంలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. పునాది దశలో ఉన్న 672 గృహాలను ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన 2832 గృహాల నిర్మాణానికి రూ.140 కోట్లను ఖర్చు చేశారు. గృహ సముదాయంలో రోడ్లు, కాలువలు వంటి మౌలిక వసతులూ కల్పించారు. 2020 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. అయినా ఇక్కడ లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయలేదు. నెల రోజుల్లో టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలంటూ ఇటీవల జరిగిన చిత్తూరు నగరపాలక సంస్థ సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. రద్దయిన ఇళ్ల లబ్ధిదారులకూ ప్రజాప్రతినిధులు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.
- పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని గూడూరుపల్లె వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను గతేడాది అక్టోబరులో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. వాటర్ ట్యాంకు నిర్మాణం, విద్యుత్తు మీటర్లు, డ్రైనేజీ పనులు పెండింగులోనే ఉన్నాయి. ఇళ్లు రద్దయిన 624 మంది చేసిన డిపాజిట్లను వెనక్కి ఇవ్వలేదు.

ఐదేళ్లుగా పంపిణీకి నోచుకోని వైనం

6,288 ఇళ్లను రద్దుచేసినా డిపాజిట్లు తిరిగివ్వని వైసీపీ ప్రభుత్వం

టీడీపీ 2014-19 మధ్యలో అధికారంలో ఉన్నప్పుడు పట్టణ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను చేపట్టింది. 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు రకాల గృహ నిర్మాణాలను ప్రారంభించారు. 300 చదరపు అడుగుల గృహానికి లబ్ధిదారుడి వాటా రూ.500 కాగా, 365 చ.అడుగులకు రూ.50 వేలు, అలాగే 430 చ.అడుగులకు రూ.లక్ష డిపాజిట్ చేయాలి. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల నుంచి అధికారులు నిర్మాణానికి ముందే వసూలు చేశారు. ప్రతి యూనిట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ రూ.1.50 లక్షల చొప్పున, మొత్తం రూ.3 లక్షలు ఉంటుంది. యూనిట్‌ను బట్టి బ్యాంకు రుణాలూ ఉంటాయి.

6288 ఇళ్ల రద్దు

టీడీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నగర, పురపాలక సంఘాల్లో 17,395 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. అప్పట్లోనే లబ్ధిదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పునాది దశలో ఉన్న గృహాలను 2020 జూన్‌లోనే రద్దు చేసేసింది. ఇలా ఉమ్మడి జిల్లాలో 6288 గృహాలు రద్దయ్యాయి. తిరుపతిలో 1200, చిత్తూరులో 672, మదనపల్లెలో 1056, శ్రీకాళహస్తిలో 1632, పుంగనూరులో 624, పుత్తూరులో 576, నగరిలో 528 గృహాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది.

రూ.37.82 కోట్ల డిపాజిట్లు పెండింగ్

వైసీపీ ప్రభుత్వం 6,288 మంది గృహాలను రద్దు చేసినా, వారు చెల్లించిన డిపాజిట్లను మాత్రం వెనక్కి ఇవ్వలేదు. రద్దయిన గృహాల్లో 1360 మంది రూ.500 వంతున చెల్లించిన రూ.6.80 లక్షలు, 2784 మంది రూ.50 వేల చొప్పున చెల్లించిన రూ.13.92 కోట్లు, 2384 మంది రూ.లక్ష చొప్పున చెల్లించిన రూ.23.84 కోట్ల డిపాజిట్లను వెనక్కి ఇవ్వలేదు. మొత్తంగా రూ.37.82 కోట్లు వెనక్కి ఇవ్వాల్సి ఉంది. మాకు ఇళ్లు దక్కలేదు.. డిపాజిట్లూ వెనక్కి ఇవ్వలేదంటూ లబ్ధిదారులు నాలుగేళ్లుగా ఆవేదన చెందుతున్నారు.



కుప్పంలోని రెస్కో ప్రధాన కార్యాలయం

ఏటీఎంలో దొంగలు పడ్డారు



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ తదితరులు



దుండగులు పగలగొట్టిన ఏటీఎం

- గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి రూ.25.98 లక్షల అపహరణ
- పక్కా ప్రణాళికతో చోరీ

గుడిపాల, జూలై 7: కారులో నలుగురు వచ్చారు. 15-20 నిమిషాల్లో ఏటీఎం మిషన్ గ్యాస్ కట్టర్‌తో కట్‌చేసి.. రూ.25.98 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇలా ముందస్తు ప్రణాళిక ప్రకారం గుడిపాలలో మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న ఏటీఎంలో దొంగతనానికి పాల్పడ్డారు.

చిత్తూరు-వేలూరు జాతీయ రహదారి పక్కన.. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎస్‌బీఐ ఏటీఎం ఉంది. ఆదివారం వేకువజామున 3.50-4.20 గంటల మధ్యలో చిత్తూరు వైపు నుంచి నలుగురు వ్యక్తులు కారులో ఏటీఎం వద్దకు చేరుకున్నారు. అప్పటికే రెక్కీ నిర్వహించిన వీరు.. ముఖాలకు మాస్కులు ధరించారు. గ్యాస్ కట్టరుతో లోపలకు వెళ్లి ఏటీఎం మిషన్‌ను కట్ ఒకరు చేస్తుండగా... మరొకరు ఆ డోర్‌ను లాగాడు. మరో వ్యక్తి ఏటీఎంలో ఉన్న డబ్బులను తీసుకెళ్లి కారులో పెట్టాడు. ఇలా 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఏటీఎంలో ఉన్న రూ. 25.98 లక్షలను తీసుకెళ్లారు. గ్యాస్ కట్టర్‌తో కట్ చేయడంతో ఆ పొగంతా ఏటీఎం నుంచి రావడంతో అప్పుడే పనులకు వెళ్లడానికి వచ్చిన వారు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. వాళ్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ తర్వాత డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఎస్పీ మణికంఠ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ నిపుణులు ఏటీఎం మిషన్ల వద్ద వేలిముద్రలను సేకరించారు. ఏటీఎంలో పెద్ద మొత్తంలో డబ్బులు ఉంచేటప్పుడు సెక్యూరిటీ గార్డును ఎందుకు నియమించలేదని బ్యాంకు అధికారులను ఎస్పీ ప్రశ్నించారు. ఏటీఎంలో సీసీ కెమెరాలు, సెన్సార్లు పనిచేసుంటే



గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంను కట్ చేస్తూ సీసీ కెమెరాకు చిక్కిన దొంగలు

దొంగలు ప్రవేశించినప్పుడు సిగ్నల్స్ వచ్చి సైరన్ మోగేదని తెలిపారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కనపడుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు, విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, ఎస్ఐలు నరేంద్రకుమార్, అనిల్‌కుమార్, లోకేష్, లక్ష్మీకాంత్, క్లూస్ టీం దినేష్, ఇంటెలిజెన్స్ అధికారి జయరాం, పోలీసులు పాల్గొన్నారు.

త్వరలోనే దొంగలను పట్టుకుంటాం: ఎస్పీ

సాంకేతికతను వినియోగించి త్వరలోనే ఏటీఎం దొంగలను పట్టుకుంటామని ఎస్పీ మణికంఠ అన్నారు. ఆదివారం ఆయన సఘటనా స్థలం వద్ద మీడియాతో మాట్లాడారు. చోరీకి పాల్పడిన వారిని త్వరలో పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, సీసీ ఫుటేజీలనూ పరిశీలిస్తున్నామన్నారు. సెక్యూరిటీ వ్యవస్థలో లోపాలుంటే సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలారం, సెన్సార్లు సమర్థంగా పనిచేసేలా ఉన్న పరికరాలను మార్చడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. దర్యాప్తులో నిర్దిష్ట ఆధారాలు సేకరించి దోషులను శిక్షిస్తామన్నారు. అనుమానాస్పద రీతిలో ఎవరైనా కనిపిస్తే సంబంధిత పోలీసులకు లేదా డయల్ 100, 112 లేదా 94409 00005 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఏడాది కిందటా చోరీయత్నం

ఇదే ఏటీఎంను ఏడాది కిందట గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టే ప్రయత్నం చేశారు. అప్పట్లో ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగలు తొలుత సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఏటీఎం మిషన్‌ను పగులగొట్టే ప్రయత్నం చేయగా.. పెద్ద ఎత్తున శబ్ధం రావడంతో చుట్టుపక్కల ఎవరైనా వచ్చేస్తారన్న అనుమానంతో వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఏటీఎంలో అలారం, సెన్సార్లు పనిచేసేలా చర్యలు తీసుకుని ఉంటే చోరీని అరికట్టి ఉండొచ్చని స్థానికులు అంటున్నారు.

కుప్పం రెస్కో (గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ)లో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. మొన్నటిదాకా వైసీపీ ఉక్కు పిడికిలో నలిగిపోయిన ఉద్యోగులు, ఉద్యోగంకోసం లక్షల్లో ముడుపులు చెల్లించి మోసపోయిన యువత.. ఇప్పుడు ఒక్కరొక్కరే బయటకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని చెబుతున్నారు. ఉన్న ఉద్యోగం ఊడినా.. ఇంకా ఉద్యోగం రాకుండా మోసపోయిన వాళ్లంతా తమ డబ్బు కోసం అధికారులను నిలదీయడానికి సిద్ధమవుతున్నారు. - కుప్పం

ఒక్కొక్కటిగా వెలుగులోకి..!

- రెస్కోలో తవ్వేకొద్దీ అక్రమాలే
- ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 52 మందికి అడ్డగోలు పదోన్నతులు
- ప్రస్తుత ఎండీ నిర్వాకం
- ఉద్యోగాలు పోతే డబ్బులకోసం నిలదీయాలని యువత నిర్ణయం

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక నాటి పాలకులు, అప్పటి ఎండీ సుబ్రమణ్యం, ప్రస్తుత ఎండీ, అప్పటి ఏడీఈ అయిన ప్రభాకర్ కలిసి 122 మందిని వివిధ ఉద్యోగాల్లో అడ్డగోలుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ ఉద్యోగాలకోసం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా ముడపులు చెల్లించినట్లు ఆయా ఉద్యోగులే చెబుతున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ నియామకాలపై దృష్టి పెట్టింది. వీరికి శుక్ర, శనివారాల్లో పోల్ టెస్ట్, ఇతర నైపుణ్య పరీక్షలు పెట్టారు. 109 మంది పరీక్షలకు హాజరవగా, అందులో 50-60 మంది అనర్హులుగా తేలారన్న సమాచారమూ ఉంది. శాంతిపురం రెస్కోలో జరిగిన పోల్ టెస్ట్ సందర్భంగా కొందరు స్తంభాలు ఎక్కలేక నిరాశతో ఇంటిదారి పట్టారు. వీరి కుటుంబీకులు పరీక్ష జరిగిన ప్రాంతానికి వచ్చి మరీ తాము ఉద్యోగాలకోసం ఎన్నేసి లక్షలు అప్పుచేసి చెల్లించామో చెప్పి కన్నీటిపర్యంతమయ్యారు. ఫ్యాను కింద కూర్చుని పనిచేసే ఉద్యోగమిస్తామని చెప్పి, చివరకు ఇలా మోసం చేశారని, తన కుమారుడికి అసలు పోల్స్ ఎక్కడమే తెలియదని ఒక తండ్రి వాపోయాడు. ఈ ఉద్యోగానికి రూ.18 లక్షలు చెల్లించామని ఆయన కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారందరినీ కలచివేసింది.

అడ్డగోలు పదోన్నతులు

ఇక, ఎన్నికల నోటిఫికేషన్‌కు మూడు రోజుల ముందు.. మార్చి 13వ తేదీన రెస్కోలో 52 మందికి అడ్డగోలుగా పదోన్నతులు ఇచ్చేశారు. డబుల్ ప్రమోషన్‌తో తన పదోన్నతే అక్రమమని ఆరోపణలు ఎదుర్కుంటున్న ప్రస్తుత ఎండీ ప్రభాకర్ ఆధ్వర్యంలోనే, నాటి పాలకుల అండతో ఈ పదోన్నతులు ఇచ్చారు. ఏడీఈ నుంచి డీఈగా ఒకరు, జేఏవో కేడర్ నుంచి ఏఏవో కేడర్‌కు నలుగురు, లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్లుగా ఐదుగురు, అసిస్టెంట్ హెల్పర్లనుంచి లైన్‌మెన్‌గా 42 మందికి ఏకకాలంలో పదోన్నతులు ఇచ్చేశారు. ఈ పదోన్నతుల్లోనూ ముడుపులు చేతులు మారడం, అస్మదీయులకు అందలం ఎక్కించడం జరిగాయి. తమ సమీప బంధువులకు సైతం అక్రమ నియామకాల్లో చోటు ఇప్పించుకున్న నాటి డీసీవో బ్రహ్మానందరెడ్డి, డీఎల్‌సీవో ఆనంద్, ఎండీ ప్రభాకర్ నేతృత్వంలోనే ఈ పద్నోతుల జాతర జరిగింది.

ఇప్పుడూ ఆ అధికారులే

సీనియారిటీ ప్రకారం మదన్‌మోహన్ అనే డీఈకి లభించాల్సిన ఎండీ పదోన్నతిని అడ్డగోలుగా పొందిన ప్రభాకర్ ఇప్పుడు కూడా అదే కుర్చీలో కొనసాగుతున్నారు. ఆయన ప్రమేయం కూడా ఉన్న 'అక్రమ' ఉద్యోగులకు ఎండీ హోదాలో ఈయనే పరీక్షాధికారిగా వ్యవహరించారు. దీనికంటే విడ్డూరం ఏమిటంటే.. ఈ అక్రమ నియామకాలపై తొలి విచారణాధికారిగా తన సమీప బంధువుకు కూడా అందులో చోటు కల్పించిన డీఎల్‌సీవో ఆనంద్ నియమితులు కావడం. వీళ్లంతా అప్పటి అధికార పార్టీ వైసీపీతో అంటకాగిన అధికారులన్నది బహిరంగ రహస్యం. ఇక, రెస్కోలో విచారణ, పరీక్షల నిర్వహణ, వాటి ఫలితాలు ఎలా ఉండబోతాయో, పర్సన్ ఇన్‌ఛార్జి అయిన జేసీ పి.శ్రీనివాసులు, కలెక్టర్ లేదా ఇతర సహకార శాఖ అధికారులు ఎంతవరకు పట్టించుకుంటారో చూడాలి.

డబ్బుకోసం ఎదురుతిరుగుతాం!

అనర్హులుగా తేల్చి ఉద్యోగాలనుంచి తొలగిస్తే తామిచ్చిన డబ్బులకోసం ఎదురు తిరగాలని ఆయా ఉద్యోగులు భావిస్తున్నారు. వీరిలో అత్యధికంగా అసిస్టెంట్ హెల్పర్లు ఉన్నారు. వీళ్లలో 99 శాతం మంది రూ.లక్షల్లో ముడుపులు చెల్లించారు. ఇప్పుడు వీరిలో కనీసం 40-50 మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదముంది. ఒక వేళ ఉద్యోగాలే కోల్పోవాల్సి వస్తే, అప్పటి ఎండీ సుబ్రమణ్యంతో పాటునాటి పాలకులకు సహకరించిన ప్రస్తుత ఎండీ ప్రభాకర్‌నూ నిలదీయడంతో పాటు తామిచ్చిన ముడుపులను వసూలు చేయాలన్న నిర్ణయానికి చాలామంది వచ్చినట్లు తెలిసింది. దీనికి నాంది శనివారం రాత్రి పడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. అప్పటి ఎండీ సుబ్రమణ్యం, ప్రస్తుత ఎండీ ప్రభాకర్ తరఫున ఏఏవో ఒకరు ఉద్యోగం ఆశ కల్పించి ఒక నిరుద్యోగినుంచి రూ.8 లక్షలు వసూలు చేశాడు. ఇంతదాకా అతడికి ఉద్యోగం ఇవ్వలేదు. సహనం కోల్పోయిన ఆ నిరుద్యోగి శనివారం రాత్రి ఏఏవో ఇంటికి వెళ్లి, ఉద్యోగం కోసం తానిచ్చిన రూ.8 లక్షలు కక్కాలని కూర్చున్నాడు. అందులో తన ప్రమేయం ఏమీ లేదని, ఉన్నతాధికారులు చెబితేనే వసూలు చేశానని ఆయన చేతులెత్తేశారు. అప్పటి ఎండీ సుబ్రమణ్యం, ప్రస్తుత ఎండీ ప్రభాకర్‌తోనూ ఆ నిరుద్యోగి దీనిపై వాగ్వాదం పెట్టుకున్నారు. అక్రమ నియామకాలపై ప్రస్తుతం వివాదం నడుస్తున్నా సరే, త్వరలోనే ఉద్యోగం వస్తుందని వారిద్దరూ అతడిని నమ్మించడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. తానిచ్చిన డబ్బులు చెల్లించకపోతే మీడియా ముందుకు వెళ్లి వాస్తవాలు వెల్లడిస్తానని అతడు హెచ్చరించారు. ఇలా ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగులుగా మారనున్న యువకులూ ఇదే బాటలో నడవడానికి నిర్ణయించుకుంటున్నారు.

నేటినుంచి ఇసుక లభ్యత

పలమనేరు, జూలై 7: పలమనేరు పరిధిలోని వినియోగదారులకు సోమవారం నుంచి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్డీవో మనోజ్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఉదయం 10 గంటల నుంచి జాతీయ రహదారిలోని నాలుగురోడ్ల కూడలి సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఒక టన్ను ఇసుక రూ.200చొప్పున విక్రయిస్తామన్నారు. ఇసుక వినియోగదారులు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. రోజుకు 300 టన్నులు మాత్రమే లోడింగ్ చేస్తామని వివరించారు. మిగిలిన వారికి మరుసటి రోజు మొదటి ప్రాధాన్యమిస్తామని తెలియజేశారు.

చిత్తూరులో మధ్యాహ్నం నుంచి..

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి, పాలూరు ఇసుక డిపోల్లో ఇసుక పంపిణీ ప్రారంభ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేసినట్లు ఆర్డీవో చిన్నయ్య తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభించాలని నిర్ణయించామని, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభిస్తారని తెలిపారు.

పుంగనూరులో ఇండోర్ షటిల్ కోర్టు నేలమట్టం

పుంగనూరు, జూలై 7: పుంగనూరు పట్టణం కొత్త ఇండ్లు సమీపంలోని ఫ్రెండ్స్ షటిల్ అసోసియేషన్ వారి ఇండోర్ షటిల్ కోర్టును గుర్తు తెలియని వ్యక్తులు నేలమట్టం చేసిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. పదేళ్ల కిందట నిర్మించిన షటిల్‌కోర్టు భవనాన్ని శనివారం రాత్రి ఎక్స్‌కవటేరుతో నేలమట్టం చేశారు. మదనపల్లె రోడ్డులో క్రీడాకారులు అసోషియేషన్ ఏర్పాటు చేసుకుని దాదాపు రూ.60లక్షలతో అత్యాధునిక వసతులతో ఈ షటిల్ కోర్టును నిర్మించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రి హోదాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దీనిని ప్రారంభించారు. ఇది నేలమట్టమైన విషయం ఆదివారం ఉదయం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శరణ్ కుమార్‌రెడ్డి, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఇతర సభ్యులు, వైసీపీ నేతలకు తెలిసి, అక్కడకు వెళ్లారు. ఆ తర్వాత చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, మరికొందరు నేతలు స్థలాన్ని పరిశీలించి అక్కడ్నుంచే ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫోను ద్వారా సమాచారమిచ్చారు. అసోసియేషన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి రాత్రి 10గంటల వరకు యువకులు షటిల్, చెస్ ఆడుకునేవారని క్రీడాకారులు తెలిపారు.

వివాదంలో షటిల్ కోర్టు స్థలం

కాగా, ఈ ఇండోర్ షటిల్ కోర్టు నిర్మాణ స్థలం చాలా కాలంగా వివాదంలో ఉంది. తన స్థలాన్ని తనకు ఇప్పించి, దారిసమస్య తీర్చాలని నాటి మంత్రి పెద్దిరెడ్డికి పూల సుబ్రహ్మణ్యం పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని బాధితులు అంటున్నారు. 1980 నుంచి పట్టణంలోని పూల వెంకటస్వామి భార్య పి.మునెమ్మకు రాగానిపల్లె గ్రామంలోని సర్వే నెంబరు 225/4ఏ/1లో 2.86 ఎకరాలు, సర్వే నెంబరు 225/6లో 24 సెంట్ల భూమి ఉంది. తర్వాత ఆ భూమి మునెమ్మ కుమారుడు పూల సుబ్రహ్మణ్యం పేరుతో రెవెన్యూ అధికారులు మార్పు చేశారు. సర్వే నెంబరు 225/6లో 24 సెంట్లలో 18 సెంట్లను ఆక్రమించి కోర్టు నిర్మాణం చేశారని, దీని వెనుకున్న తమ పొలానికి వెళ్లే దారిని ఆక్రమించారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలంటూ పూల సుబ్రహ్మణ్యం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగారు.





తిరుమల కొండపై వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ సోదాలు వేగవంతంగా చేస్తోంది. ఐదేళ్లలో విమర్శలొచ్చిన వాటిపైనే కాకుండా ప్రతి విభాగాన్నీ తనిఖీ చేయడంతోపాటు అక్కడి అధికారులు, సిబ్బందిని, బదిలీపై వెళ్లిన వారినీ ప్రశ్నిస్తున్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, నిధుల జారీ వంటి వాటిపై ఆరా తీసి.. స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తూ.. ముఖ్యమైన ఫైళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలపై విజిలెన్స్

వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సోదాలు

టీటీడీలో మొదలైన ప్రకంపనలు

గత సీఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో టీటీడీలో తీవ్రస్థాయిలో అవినీతి కుంభకోణాలు జరిగాయనే విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని, వ్యవస్థలను నాశనం చేశారంటూ ఆగ్రహించారు. తిరుమల నుంచే ప్రక్షాళన మొదలు పెడతామని ప్రకటించారు. ఈక్రమంలో 15 రోజులుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన స్టేట్ విజిలెన్స్ కమిటీ.. టీటీడీలో సోదాలు చేయడంతో ప్రకంపనలు మొదలయ్యాయి. సీనియర్ ఎస్పీ కరీముల్లా ఆధ్వర్యంలో దాదాపు 40 మంది సభ్యులతో కూడిన స్టేట్ విజిలెన్స్ బృందం టీటీడీలోని అన్ని విభాగాలను తనిఖీ చేస్తోంది.

టీటీడీపైనే ఫోకస్

శ్రీవారి ఆర్జితసేవా టికెట్లు, వైసీపీ నాయకులకు కేటాయించిన వీఐపీ బ్రేక్, ప్రొటోకాల్ దర్శనాలను పరిమితికి మించి ఎవరికి ఎన్ని ఇచ్చారనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటికే తిరుమలలోని ఈవో కార్యాలయంలో విజిలెన్స్ బృందం పలుమార్లు తనిఖీ చేసి.. ఇద్దరు ముఖ్య అధికారుల స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. అలాగే కేటాయింపులకు సంబంధించిన పలు ఆధారాలను కూడా సేకరించినట్టు సమాచారం. మరోవైపు వైకుంఠం కాంప్లెక్స్ వద్దనున్న ఆర్జితం కార్యాలయంలోని ఐటీ విభాగంలోనూ సోదాలు చేశారు. ప్రభుత్వం మారిన వెంటనే రికార్డులను తారుమారు చేశారనే ఆరోపణలు ఉన్న క్రమంలో స్వయంగా వెళ్లి డేటాను పొందినట్టు తెలుస్తోంది. అలాగే శ్రీవాణి ట్రస్టు ద్వారా కేటాయించే టికెట్ల కౌంటర్లను కూడా తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని టికెట్లు ఇస్తున్నారు, ఎంత నిధులు వస్తున్నాయి, అవి ఏ ఖాతాలో పడుతున్నాయనే అంశాలపై ఆరా తీశారు. శ్రీవారి అన్నప్రసాదాలు, లడ్డూల తయారీకి కొనుగోలు చేస్తున్న ముడి సరుకుల కొనుగోళ్లలో అక్రమాలు, నాణ్యత ప్రమాణాలు పరిశీలించాల్సిన అధికారికి అర్హత ఉందా, లేదా, క్వాలిటీ కంట్రోల్ వింగ్, ల్యాబ్ టెస్టింగ్, హెల్త్ అధికారుల తీరును పరిశీలించి ముఖ్య అంశాలను నమోదు చేశారు. ఎస్టేట్ విభాగం ద్వారా అతిథిగృహాల నిర్మాణం, దుకాణాల లైసెన్స్ రెన్యువల్స్, నగదు బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లు, ఆభరణాల భద్రత, టీటీడీ బోర్డులో టేబుల్ అజెండాగా పనులకు నిధుల మళ్లింపు వంటిపైనా పరిశీలన చేశారు.

ఇంజనీరింగ్ పనులపై..

వైసీపీ ప్రభుత్వంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. కమీషన్ల కోసం నిబంధనలను ఉల్లంఘించి మరీ భారీగా ఇంజనీరింగ్ పనులకు నిధులు మళ్లించారనే ఆరోపణలున్నాయి. దాంతో స్టేట్ విజిలెన్స్ బృందం ప్రత్యేకంగా ఇంజనీరింగ్ విభాగంలో సోదాలు చేసింది. ఏ పనులకు నిధులు కేటాయించారు, నిజంగా నిధులు కేటాయించాల్సిన అవసరముందా, ఎంత కేటాయించారు, నిజంగానే కమీషన్లు పొందారా వంటి వాటిపై కూడా విజిలెన్స్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కోట్లాది రూపాయల పనులను కొందరికే కట్టబెట్టడం, ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు,గత బోర్డు సభ్యులకు ఎలాంటి సంబంధాలు ఉన్నాయి వంటి అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది.

కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు

తనిఖీలు, రికార్డుల స్వాధీనం, స్టేట్‌మెంట్ల సేకరణతో ఐదేళ్లపాటు టీటీడీలోని కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నాయకులు, ఉన్నతాధికారులు బాగానే ఉన్నారని, తమకు ఏ ఆపద వస్తుందో తెలీక సతమతమవుతున్నారు. మాజీ ఈవో ధర్మారెడ్డికి సన్నిహితంగా ఉండి.. ప్రతి ఫైల్‌ను ముందుకు నడిపించిన అధికారులు ఇప్పుడు విజిలెన్స్ సోదాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నట్టు సమాచారం.

ప్రక్షాళన దైవానుగ్రహం

టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై కొరడా ఝళిపించేలా సీనియర్ అధికారులతో రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేయడం దైవానుగ్రహం. దీనికి శ్రీవారి భక్తుడిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మాజీ ఈవో ధర్మారెడ్డి కార్యాలయం కేంద్రంగా దందా నడిపించిన అధికారుల వ్యవహారంపై, ఆదాయానికి మించిన ఆస్తుల సంపాదన, సమగ్ర సమాచార పత్రాలను ఆదివారం విజిలెన్స్ ఎస్పీకి అందజేశా. ఐదేళ్లలో ధార్మిక సంస్థకు జరిగిన నష్టాన్ని వివరించా. గతంలో నేను పంపిన సమాచారం ఆధారంగానే సీఎం చంద్రబాబు విజిలెన్స్ బృందాన్ని పంపారు. ధర్మారెడ్డికి సంబంధించిన కొందరు భజనపరులు రికార్డులను మాయం చేసే కుట్రలు చేస్తున్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరా. కొంతమంది అధికారులు, అధికారపార్టీ నాయకులు సొంత లాభాల కోసం ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయల టెండర్లు పిలవడంలో కీలకపాత్ర పోషించిన సూత్రధారులు, పాత్రధారుల వివరాలను విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లా.

- నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

జిల్లాకు విశ్వవిద్యాలయం తీసుకొస్తా : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల

చిత్తూరు రూరల్, జూలై 7: చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ అధ్యక్షతన ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాకు విశ్వవిద్యాలయాన్ని తీసుకొస్తానని స్పష్టంచేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తామన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. టిడ్కో ఇళ్లనిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహకరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీని నాయకులు సన్మానించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం ఇన్‌చార్జ్ మునిరత్నం నాయుడు, మాజీ మేయర్ కఠారి హేమలత, రాష్ట్ర అధికారప్రతినిధి సురేంద్రకుమార్, రాధేయ్ కన్‌స్ట్రక్షన్ అధినేత రాధేయ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ, నాయకులు సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, సీఎంటీ త్యాగరాజన్, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



యుగంధర్ (ఫైల్ ఫొటో)

నింద్ర, జూలై 7: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నింద్ర మండలం శ్రీరామపురంలో ఆదివారం వెలుగుచూసింది. గ్రామస్తుల వివరాల మేరకు.. శ్రీరామపురం గ్రామానికి చెందిన బెల్లం యుగంధర్(52) తనకున్న ఒకటిన్నర ఎకర పొలంలో నీటి కోసం ఐదు బోర్లు వేశాడు. నీరు పడలేదు. ఇందుకోసం రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. ఇతరతరా అవసరాల కోసం మరో రూ.5లక్షలు అప్పు చేశాడు. ఇందులో రూ.లక్ష పిచ్చాటూరు యూనియన్ బ్యాంక్ నుంచి లోన్ తీసుకోగా, మిగతావి ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకున్నాడు. పొలంపై ఆదాయం లేకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

39మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాల నిలుపుదల

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న కారణంగా 39మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ నెలలో కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించని కారణంగా వారి జీతాలను నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

మునీశ్వరుడి జాతర



ప్రత్యేక అలంకరణలో మునీశ్వరుడు, మునీశ్వరుడి ఉత్సవమూర్తి ఊరేగింపు

గుడుపల్లె, జూలై7: గుడుపల్లె మండలం పెద్ద బజనవాడలో ఆదివారం మునీశ్వరుడి జాతర జరిగింది. గ్రామ సమీపంలో మునీశ్వరుడి ప్రతిమ వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి.. పిండిదీపాలు వెలిగించి మొక్కుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించారు.

భక్త జన సంద్రంగా బోయకొండ





ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, జూలై7: బోయకొండ క్షేత్రం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. అమ్మవారికి ప్రీతికరమైన ఆషాడ మాసం మొదటి ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. భక్తులు అధికసమయం క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో రూ.13,28,662 ఆదాయం.. అన్నదానం కోసం రూ.9500 విరాళం వచ్చాయి. ఇక కొండపై నుంచి రణభేరిగంగమ్మ ఆలయం వరకు వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆలయ ఈవో చంద్రమౌళి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), జూలై 7: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి దర్శనార్థం ఉదయం నుంచి వేలాదిగా భక్తులు కాణిపాక క్షేత్రానికి విచ్చేశారు. క్యూలు పూర్తిగా నిండిపోయి భక్తులు బయటనిలబడాల్సి వచ్చింది. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

తోటకనుమలో మరో బాలికకు డెంగ్యూ

వివాహిత మృతిపై డీపీవో విచారణ





గ్రామంలో కొనసాగిస్తున్న వైద్య శిబిరం, తాగునీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

వి.కోట, జూలై 7: వి.కోట మండలం తోటకనుమలో మరో బాలిక డెంగ్యూ బారినపడ్డారు. గ్రామంలో జ్వరాల తీవ్రతపై 'జ్వరాలతో పడకేసిన తోటకనుమ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించారు. విష జ్వరాలపై తనకు నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో డీపీవో లక్ష్మి, ఎంపీడీవో గోవర్ధన్ తదితరులు గ్రామానికి చేరుకుని సమస్యపై ఆరా తీశారు. రెండు రోజుల కిందట జ్వరంతో స్వాతి మృతిచెందగా.. ఆమె కుటుంబీకులతో వీరు మాట్లాడారు. మృతురాలి ఎనిమిదినెలల కుమార్తె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మరోవైపు జిల్లా మలేరియా అధికారి, ఇతర వైద్యులు ఆదివారం వైద్యశిబిరం కొనసాగించారు. ఇప్పటికే చాలా మంది బాధితులు ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బందితో కలసి గ్రామంలో ఇంటింటా జ్వరాలపై సర్వే చేపట్టారు. జ్వరంతో మృతి చెందిన స్వాతి ఇంటికి.. పక్కింట్లో ఉన్న 14 ఏళ్ల బాలికకు జ్వరం అధికం కావడంతో శనివారం రాత్రి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డెంగీ అని తేలడంతో ఆమెను కుప్పానికి తరలించారు. ఇప్పటికీ గ్రామంలో చాలా మంది జ్వరంతో పడకేశారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మందులు అందజేశారు. అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి ట్యాంకును గ్రామస్తుల సహకారంతో బాగు చేశారు. పైప్‌లైన్ లీకేజీలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతు చేశారు. వారంలో ఓ రోజు డ్రై డేగా పాటించాలని, మురుగు నీటి కాలువలను శుభ్రం చేసుకోవాలని కార్యదర్శిని డీపీవో ఆదేశించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం కొనసాగించాలని సూచించారు.

జే న్యూటౌన్ ఆక్రమణలు తొలగించండి: సీపీఐ



చెరువు మొరవను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పుంగనూరు, జూలై7: పుంగనూరు బైపాస్ రోడ్డులో మాజీ ఎమ్మెల్యే ఎన్.శ్రీధర్‌రెడ్డికి చెందిన జేన్యూటౌన్ వెంచర్‌లో గత ప్రభుత్వంలో జరిగిన ఆక్రమణలు తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా సహాయకార్యదర్శి టి.జనార్దన్ డిమాండు చేశారు. బైపాస్ రోడ్డులోని గుడిసిబండ పంచాయతీ తీగలమ్మ చెరువు మొరవను ఆదివారం వీరు పరిశీలించారు.మొరవలో వెంచర్‌కు సంబంధించిన పైపులు పూడ్చడానికి నీటిపారుదల శాఖ అధికారులు అనుమతించడంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. మొరవ కుదించడంతో వర్షపు నీరు పుంగనూరులోకి చేరి జలమయమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్‌హెచ్, ఇరిగేషన్ చెరువు మొరవ దురాక్రమణ జరిగినా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పుంగనూరు మండలం భీమగానిపల్లె, సుగాలిమిట్ట పంచాయతీల్లో వైసీపీ నాయకులు కుంటలు, చెరువులు, ప్రభుత్వ భూములు, దేవదాయశాఖ భూములు ఆక్రమించుకుని ప్లాటుగా మార్చి అమ్మేశారని ఆరోపించారు. ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీపీఐ నాయకులు రామ్మూర్తి, గురవయ్య, మోహన్ పాల్గొన్నారు.

రుయాలో స్టాఫ్‌నర్సుపై రోగి దాడి

తలపై తీవ్రగాయం



బాధితురాలికి చికిత్స చేస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), జూలై 7: స్టాఫ్ నర్సుపై ఓ రోగి దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి తిరుపతిలోని రుయాస్పత్రిలో జరిగింది. మదనపల్లె మండలం రాజానగర్‌కి చెందిన దుర్గాప్రసాద్ విషం తాగడంతో నాలుగు రోజుల కిందట కుటుంబీకులు రుయాకు తీసుకొచ్చారు. ఇక్కడి ఏఎంసీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. శనివారం నాటికి కోలుకున్న అతనికి రాత్రి అట్రాసిన్ అనే ఇంజక్షను వేశారు. అప్పటినుంచి మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా ప్రవరిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇదే వార్డులోకి స్టాఫ్‌నర్సు యశోద విధులకు హాజరయ్యారు. రోగులకు ఇంజక్షన్లు వేసి.. తన కుర్చీలో కూర్చొన్నారు. ఆ సమయంలో దుర్గాప్రసాద్ వెనుక నుంచి ఐవీ స్టాండు తీసి తలపై బలంగా కొట్టాడు. ఆమెకు తీవ్రగాయమైంది. గమనించిన సెక్యూరిటీ వచ్చి అతడిని పట్టుకుని పక్క గదిలోకి తీసుకెళ్లారు. బాధితురాలికి వైద్యులు ఎనిమిది కుట్లు వేయాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ రవిప్రభ వచ్చి.. ఘటనపై విచారణ చేపట్టారు. తొలుత వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చినా రోగికి మతిస్థిమితం లేదనే కారణంతో ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ విషయం బయటకు రానీయకుండా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, తమకు రక్షణ లేకుండా పోయిందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీనిపై సోమవారం అధికారులను నిలదీసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది.

పంట రుణాలు.. మరింత ఆలస్యం!

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: ఎన్నికలు.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం తదితర కారణాలతో పంట రుణాలు మరింత ఆలస్యం కానున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు ఐదు లక్షల మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం పంట రుణాలను అందిస్తుంది. కొత్తప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పాలక మండళ్లు రద్దయ్యాయి. కొత్త పాలకవర్గాలను నియమించాకే పంటరుణాలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ జూన్ నుంచే ప్రారంభమైంది. ఇప్పటికే వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో పంటరుణాల మంజూర్లు చురుగ్గా కొనసాగాలి. ప్రస్తుతం ప్రధాన బ్యాంకుల్లో ఏ బ్యాంకు ద్వారా కూడా పంటరుణాలు అందలేదు. ఈ సంవత్సరం పంటరుణాల మంజూరుకు సంబంధించి జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల, జిల్లా అధికారులు ఫిబ్రవరి నెలలో సమావేశమై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఆమోదానికి పంపారు. అక్కడినుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా వివిధ మార్పుల తర్వాత ఎన్నికలకు ముందే జిల్లాకేంద్రానికి చేరింది. ఎన్నికల కోడ్, ఫలితాల విడుదల, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, కలెక్టర్ల బదిలీలు తదితర కారణాలతో ఈ జాబితాపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. 2023-24లో రూ.13వేల కోట్ల పంటరుణాల పంపిణీకి బ్యాంకర్ల కమిటీ లక్ష్యం నిర్ణయించగా, రూ.14వేల కోట్ల పంపిణీ జరిగినట్లు బ్యాంకువర్గాలు తెలిపాయి. ఈ సంవత్సంలో పంట రుణాల లక్ష్యంపై త్వరలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం జరిపి నిర్ణయం తీసుకుంటామని ఎల్డీఎం ఎ.హరీష్ ఆదివారం తెలిపారు.

డీసీసీబీ లాభం రూ.9.65 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కు గతేడాది రూ.9.65 కోట్లు నికరలాభం వచ్చిందని సీఈవో మనోహర్ గౌడ్ తెలిపారు. ఇటీవల బ్యాంకు లావాదేవీలపై నిర్వహించిన ఆడిట్‌లోని ఈ వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. గత ఏడాది షేర్ కేపిటల్ రూ.80 కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.87 కోట్లకు పెరిగాయన్నారు. డిపాజిట్లు కూడా 2022-23లో రూ.853 కోట్లు ఉండగా, 2023-24లో రూ.932 కోట్లకు పెరగ్గా.. వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.1100 కోట్లకు పెంచాలని తీర్మానించామన్నారు. లోన్స్ ఔట్‌స్టాండింగ్ రూ.1563 కోట్ల నుంచి రూ.2002 కోట్లకు చేరిందన్నారు. అన్నిరకాల రుణాలు గతఏడాది రూ.1560కోట్లు పంపిణీ చేయగా, ఈసారి రూ.2000కోట్లకు పెంచామని, రానున్న ఆర్థిక సంవత్సరం రూ.2500కోట్లు అందించాలని నిర్ణయించామని వివరించారు. ఈ ఏడాది కొత్త పల్లిమిట్ట, కలకడ, కలికిరి, వడమాలపేట, పెద్దమండ్యం ప్రాంతాల్లో నూతన శాఖల ప్రారంభానికి అనుమతి కోసం దరఖాస్తు చేశామన్నారు.

'అమరావతి' నిర్మాణానికి రూ.30వేల విరాళం



శ్రీరంగరాజపురం, జూలై 7: రాజధాని అమరావతి కోసం పద్మాపురం గ్రామ పంచాయతీకి చెందిన మహిళా సంఘాలు రూ.30వేలు అందించాయి. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో టీడీపీ సీనియర్ నాయకుడు మాధవ నాయుడుకు అందించారు. ఈ కార్యక్రమంలో సీసీ మునేంద్ర, వీవో మేనక, వీవో అధ్యక్షురాలు చెంచమ్మ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల దినం

చిత్తూరు, జూలై 7: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిత్తూరు పాత డీపీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు.

పుంగనూరు సమస్యలు పరిష్కరిస్తా: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల,జూలై7: పుంగనూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కారంతో పాటు అభివృద్ధి కృషిచేస్తానని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంత్రి ఆదివారం రొంపిచెర్లలోని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి ఇంటికి వచ్చారు. ఆయనను చల్లా రామచంద్రారెడ్డి పూలమాలలు వేసి శాలువతో సన్మానించారు. నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించారు. సమస్యలను ముఖ్య మంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాని చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గంలో పర్యటిస్తానని చల్లాబాబుకు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నియోజకవర్గం ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, చౌడేపల్లి టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పతిరాజు, నాయకులు రవి నాయుడు, అమరనాథరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, షేక్ కరీముల్లా, అంజాద్‌ఖాన్, శేషాద్రినాయుడు, రామ్మూర్తి, నాగిశెట్టి నాగరాజ, పులిచెర్ల కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ ఆక్రమణ



బస్సు షెల్టర్‌లో కొబ్బరికాయల దుకాణం

పలమనేరు, జూలై7 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలమనేరు జాతీయరహదారిలో ఉన్న రంగబాబు కూడలిలో బస్సుషెల్టర్ ఆక్రమణకు గురైంది. అప్పట్లో దీనిపై పలుమార్లు స్థానికులు మున్సిపల్, జాతీయరహదారి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బస్సు షెల్టర్ ఉన్న ప్రాంతం ఆక్రమణకు గురికావడంతో ప్రయాణికులు బస్సుల కోసం ప్రమాదకరంగా రోడ్డుమార్జిన్ లో నిల్చోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఈ ఆక్రమణను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మనోహరరెడ్డికి పెన్షనర్ల నివాళులు



పలమనేరు, జూలై 7: పలమనేరు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు మనోహరరెడ్డి సేవలు చిరస్మరణీయమని పెన్షనర్ల సంఘం నాయకులు కీర్తించారు. ఆదివారం పెన్షనర్ల సంఘ భవనంలో మనోహరరెడ్డి సంతాప సభ నిర్వహించారు. మనోహరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు నల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటక్రిష్ణయ్య, జిల్లా సహఅధ్యక్షులు రత్నారెడ్డి, ఉపాధ్యక్షులు గురుమూర్తి, కోశాధికారి దవన ముని, సీనియర్ నాయకులు దొరస్వామి, సభ్యులు విజయకుమారరెడ్డి, శేఖర్, పొన్నుడి, బాలసుబ్రమణ్యం, సుబ్బరాజశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లెలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



గుడుపల్లె, జూలై 7: మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ కేంద్రంలో ఆదివారం సర్పంచ్ ఎల్లప్ప ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగాయి. గ్రామంలోని వీధుల్లో అక్కడక్కడా ఉన్న చెత్త దిబ్బలను తొలగించారు. కాలువలో ఉన్న మురుగు, చెత్తలను తీసి శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. అనంతరం సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలు గ్రామంలో ఇంటింటా తిరిగి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి



ఉన్సిగానిపల్లె గ్రామ సమాఖ్య సమావేశంలో నేతలు

రామకుప్పం, జూలై 7: రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పత్రా నారాయణాచారి తెలిపారు. ఆదివారం వారు ఉన్సిగానిపల్లె గ్రామ సమఖ్య సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 ఏళ్ల నిండిన వారికి నెలకు రూ.1500 ఇచ్చే పథకాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, కృష్ణారెడ్డి, మునేష్, మురుగేష్, సుభాష్, గోపి, బీరప్ప, గుణప్ప పాల్గొన్నారు.

120 మందికి నేత్రపరీక్షలు



పలమనేరు, జూలై7 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్రచికిత్సా శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. చెన్నై శంకరనేత్రాలయ నేత్రవైద్యులు మురళి 120 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 50 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, చెన్నై వెళ్లి వచ్చేందుకు ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామని డాక్టర్ మురళి తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేడు అర్జున తపస్మాన్

కల్లూరు, జూలై 7: పులిచెర్ల మండలం మంగళంపేట భారతమిట్టలో కొనసాగుతున్న మహాభారతం ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

ఆర్‌ఎస్ఎస్ గురుపూజోత్సవం

పుంగనూరు రూరల్, జూలై7: ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలో డాక్టర్ గురూజీ భరతమాత, భగవత్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూ చైతన్యమే సమాజానికి శ్రేయస్కరమని తెలియజేశారు.

కంటివైద్యశిబిరానికి విశేష స్పందన



బైరెడ్డిపల్లె, జూలై 7 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్యనిపుణులు 76 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. 10 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన వారికి నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ ప్రతినిధులు తిమ్మక్క, శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాట్య ప్రదర్శన



ఐరాల(కాణిపాకం), జూలై 7: కాణిపాక ఆస్థాన మండపంలో ఆదివారం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ, చిత్తూరు జయంతి స్కూల్ ఆఫ్ కూచిపూడి పాఠశాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఆహూతులను కట్టిపడేసింది.

వాహనం ఢీకొని ఒకరి మృతి

బంగారుపాళ్యం, జూలై 7 : చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డు పక్కన వెళుతుండగా వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. అతని వయస్సు 65 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

అలరించిన దుర్యోధన వధ



శ్రీరంగరాజపురం, జూలై 7: మండలంలోని చిల్లామాకుల పల్లె మహా భారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఆలయ ప్రాంగణంలో దుర్యోధనుడి బొమ్మను మట్టితో రూపొందించి పూజలు చేశారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు తెచ్చే సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, నారాయణరెడ్డి, డిల్లర్ సుబ్రమణ్యంరెడ్డి, దేవేంద్రరెడ్డి, గురుస్వామిరెడ్డి, జయరాజ్, చిన్నబ్బ, ఏసు, గోవిందయ్య పాల్గొన్నారు.

ఆగిన అభివృద్ధిని కొనసాగిస్తాం

- రూ. 36.2 కోట్ల పనులకు సీఎం ఆమోదం
- వి.కోట మండల సమీక్షలో ఎమ్మెల్యే అమర్



గెస్తిపల్లె వద్ద ఆర్ధాంతరంగా ఆగిన శీతల గిడ్డంగుల పనులు

వి.కోట, జూలై 7: వి.కోట మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరై వైసీపీ ప్రభుత్వం అర్ధాంతరంగా ఆపేసిన పనులను తిరిగి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఏఎంజీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, పార్టీ మండల అధ్యక్షులు రంగనాథ్ తెలిపారు. మండలంలో ఆగిపోయిన అభివృద్ధి పనులపై మండల నాయకులతో ఆదివారం ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వి.కోటలో ఆగిన పనుల వివరాలను ఇటీవల కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబుకు వివరించామన్నారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు రూ.32.2 కోట్ల పనులను తిరిగి మంజూరు చేస్తూ సీఎంవో నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

మంజూరైన పనులు

రూ.15 కోట్లతో పాపేపల్లె సమీపంలో మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, రూ.14 కోట్లతో కర్రిప్పల్లె వద్ద 10.30 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, రూ.5 కోట్లతో గెస్తింపల్లె వద్ద అర్ధాంతరంగా ఆగిన శీతల గిడ్డంగుల పనుల పునఃప్రారంభం, రూ. 1.2 కోట్లతో ఖాజీపేట వద్ద షాదీ మహల్, రూ.కోటితో వి.కోటలో పునాదులకే పరిమితమైన అంబేడ్కర్ భవన్ పనులను తిరిగి ప్రారంభించనున్నారు.

ఆదేశాల కోసం వెయిటింగ్

వి.కోటకు తూర్పు వైపున బైపాస్ రోడ్డు, రూ.2 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్మాణ దశలో ఉన్న మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులకు ఆదేశాలు రావాల్సి ఉంది. అదేవిధంగా మండల పరిధిలో పూర్తి కాని రోడ్లు, అంగన్వాడీ భవనాలు, ఇతర అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ పనులకు సంబంధించి ఆయా శాఖల అధికారులు నివేదికలను తయారు చేసి పనుల పునఃప్రారంభానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సొంత నిధులతో రోడ్ల పునరుద్ధరణ



ఎర్రనాగులపల్లె రోడ్డును బాగుచేసిన దృశ్యం

సోమల, జూలై 7: ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులపల్లెకు పుంగనూరు ప్రధాన రోడ్డు నుంచి ఉన్న పురాతన రోడ్డు మార్గం గుంతలమయంగా మారింది. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు వేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించారు. ఫలితం లేకపోవడంతో ఎర్రనాగులపల్లెకు చెందిన దాత గండికోట రాజా స్వచ్ఛందంగా ఆదివారం ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి ప్రయాణానికి అనువుగా మార్గం ఏర్పాటు చేశారు. దీనిపై ఈ మార్గంలో ప్రయాణించే మేటిమంద, గొల్లపల్లె, చింతలవారిపల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ● చెన్నపట్నం చెరువు సమీప మధురమలై కొండలోని మల్లీశ్వరస్వామి ఆలయానికి రెండు కిలోమీటర్ల అటవీ మార్గంలో భక్తుల రాకపోకలు సాగించే రోడ్డు దుస్థితిలో ఉండడంతో దాతలు స్పందించారు. పలువురు దాతలు మఠంగొల్లపల్లెకు చెందిన కృష్ణ ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డును చదును చేశారు. పోలూరు సుధాకర్, రాజేశ్వరనాయుడు, శ్రీనివాసులు పనులను పర్యవేక్షించారు.

వైభవంగా గంగమ్మ జాతర





ప్రత్యేక అలంకరణలో గంగమ్మ, గంగమ్మ గుడి వద్ద పిండిదీపాలు వెలిగిస్తున్న మహిళలు

గుడుపల్లె, జూలై 7: మండల పరిధిలోని పెద్దగొల్లపల్లె గ్రామంలో గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం గంగమ్మ ఆలయంలో అమ్మవారి మూల విగ్రహానికి పూజారులు అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మహిళలు పిండిదీపాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా రాళ్ల గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత పొంగళ్లు పెట్టి, పిండిదీపాలు వెలిగించి కర్పూర హారతులు పట్టారు. అనంతరం జంతు బలులు ఇచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, చెరువులు నిండాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

10న మత్స్యకార దినోత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

పుంగనూరు రూరల్, జూలై7: ఈ నెల 10వ తేదీన పుంగనూరులో జరిగే మత్స్యకార దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బెస్త, మత్స్యకారులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో మత్స్యదినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుంగనూరు శ్రీవెంకటేశ్వర మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. తమకు బడ్జెట్ కేటాయించలేదని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. జగన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. పుంగనూరులో చెరువులు కబ్జాచేసి మత్స్యసంపద ఉత్పత్తి లేకుండా చేశారని, మత్స్యకార భరోసా ఇవ్వకుండా మోసంచేశారని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని ఆహ్వానించామని తెలిపారు. నియోజకవర్గంలోని మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు కామేశ్వర, దొరస్వామి, ప్రకాశ్, నగేశ్,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రామారావుపై దాడి అమానుషం'

పలమనేరు, జూలై7 : పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో పెన్షన్ల పంపిణీ సందర్భంగా సీపీఎం నాయకులు రామారావుపై టీడీపీకి చెందిన వారు చేసిన దాడిని ఖండిస్తున్నామని సీపీఎం నేత ఓబుల్‌రాజు, కేవీపీఎస్ నాయకుడు ఈశ్వర్ పేర్కొన్నారు. పలమనేరులో ఆదివారం వీరు విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనల వల్లనే గత ప్రభుత్వం రాష్ట్రంలో నామరూపాలు లేకుండా పోయిన విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు.

ఘనంగా ప్రారంభమైన గంగ జాతర



రామకుప్పం, జూలై 7: రామకుప్పంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలో ప్రధాన అమ్మవారి ఆలయమైన దిగువ వీధి గంగమ్మ ఆలయం శివాజీ నగర్, రెడ్డివీధి, మాదిగ వాడ, రామ్ నగరం కాలనీ, కోదండ రామనగర్ కాలనీ, సల్లాపురమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. దిగువవీధి గంగమ్మ ఆలయంలో స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను పంచిపెట్టారు. అదేవిధంగా పట్టణంలో అన్ని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి.

కురబల సంక్షేమానికి ప్రత్యేకశ్రద్ధ



నూతన కార్యవర్గంతో కురబ సంఘం నాయకులు

బైరెడ్డిపల్లె, జూలై 7 : కురబల సంక్షేమానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటామని రాష్ట్ర కురబ సంఘం గౌరవాధ్యక్షుడు నాగభూషణం అన్నారు. మండలంలోని పాతూరునత్తం గ్రామంలోవున్న రేవణసిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కురబ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగభూషణం మాట్లాడుతూ కురబలు ఐక్యతతో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల కురబ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కురబ సంఘం గౌరవాధ్యక్షుడిగా గౌరప్పగౌడు, అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షులుగా శంకరప్పగౌడు, విశ్వనాథ్‌గౌడు, లోకేశ్వర్ గౌడు, ప్రధానకార్యదర్శిగా జనార్ధనగౌడు, కోశాధికారిగా సుబ్రమణ్యంగౌడు, యువత అధ్యక్షుడిగా వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి కురబసంఘ నాయకులు నాగభూషణం, బత్తిగౌడు, గౌరప్పగౌడు తదితరులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



సోమల జయంతి కాలనీలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సోమల, జూలై 7: సోమల మండలంలో ఎమార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం సోమల జయంతి కాలనీ, మిట్టపల్లె దళితవాడల్లో మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి, రామనాథం, ప్రకాశ్, వెంకటరామయ్య, శివరామయ్య, సురేశ్, రమణయ్య, మొగిలీశ్వర్, మణికంత, లక్ష్మీపతి, సురేంద్ర, శ్రీకాంత్, ప్రభుకుమార్, లోకేశ్ పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట, పలగార్లపల్లె, తిర్నిపల్లె, మల్లెవారిపల్లెలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజప్ప, హరిబాబు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎమార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ నరసింహులు పిలుపునిచ్చారు. స్థానిక దూళ్లవాండ్లఇళ్ల వద్ద ఎమార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాలను ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఎమార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. సంఘం నాయకులు వెంకటరమణ, నాగభూషణం, విజయ్, విశ్వనాథ్, ప్రభాకర్, నారాయణ, అమరనాథ్, బాబు, బుడ్డన్న, నరసింహులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రావాలని మంత్రికి ఆహ్వానం



మంత్రిని కలసిన సోమల టీడీపీ నాయకులు

సోమల, జూలై 7: మంత్రి రాంప్రసాద్ రెడ్డిని ఆదివారం సోమల టీడీపీ నాయకులు రాయచోటిలో కలసి సన్మానించారు. అలాగే మండల పర్యటనకు, ఈ నెల 17న కమ్మపల్లె లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని ఆహ్వానించారు. ఇటీవలి ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మండలంలో లభించిన మెజారిటీని, స్థానిక ఎన్నికల్లో ఎదుర్కొన్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

రొంపిచెర్ల, జూలై7: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ జాతర పురస్కరించుకొని ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి తెల్లవారుజామున 101 బిందెల పసుపు నీళ్లతో అభిషేకం, మహాభిషేకం, మంగళహారతులు, ప్రత్యేక పూజలు, పొంగళ్లు పెట్టి, పిండి దీ పారాధనలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని పుష్పపల్లకీపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాతమ్మకు ప్రత్యేకపూజలు

కల్లూరు, జూలై 7: పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో వైభవంగా మాతమ్మ అమ్మవారి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మాతమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి వివిధ రకాల పూజలు చేశారు. వేడుకల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భాష, సంస్కృతుల పరిరక్షణకు కృషిచేయాలి



భాషా పోటీలలో గెలుపొంది సన్మానం అందుకున్న తెలుగు బాషాభిమానులు

గంగవరం, జూలై 7: తెలుగుభాష, సంస్కృతుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే అవి సజీవంగా నిలబడగలుగుతాయని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం గంగవరంలోని కళామందిరం ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించ డానికి కృషిచేస్తున్నవారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళామందిరం స్థాపించిన నాటినుంచి ఈ రోజు వరకు 153 భాషా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి, 1.50 లక్షల పుస్తకాలను విద్యార్థులు, భాషాబిమానులకు ఉచితంగా అందించామన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భాషాభిమానుల సేవలను గుర్తించి వందలాది మందిని సన్మానించి పురస్కారాలు ప్రదానం చేశామన్నారు. అనంతరం ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన భాషా పోటీలలో గెలుపొందిన డాక్టర్ మౌని (తిరుపతి), రఘుపతి రామస్వామి, ధనంజయ (హోసూరు), ఈశ్వరప్రసాద్, మురళీనాథ్, నరేంద్ర, విజయకుమార్ (పలమనేరు), రామలింగారెడ్డి (బెంగళూరు), పి.విజేంద్రనాయుడు (గంగమ్మ గుడి), గంటా మోహన్, గుమ్మడి జయరామిరెడ్డి, కట్టమంచి క్రిష్ణవేణి (చిత్తూరు), శ్రీనివాసులు (గంగవరం), సుంకుల జమ్మయ్య (నంద్యాల), అమృత (సోమల)ఎ.జె.సురేష్ (కుప్పం), చంద్రశేఖరయ్య (పెద్దపంజాణి)లకు జ్ఞాపికలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. వార్షికోత్సవ పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, మాధవరెడ్డి, సీతారామయ్య, బాబు, నవీన్, విజయ్, మురళి, చాణిక్య, మొహిద్దీన్, దాము, అబిదాలీ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కనులవిందుగా నాట్య ప్రదర్శన



ఐరాల(కాణిపాకం), జూలై 7: కాణిపాక ఆస్థాన మండపంలో ఆదివారం నృత్య ప్రదర్శనలు కనుల విందుగా సాగాయి. ఆలయ, చిత్తూరు జయంతి స్కూల్ ఆఫ్ కూచిపూడి పాఠశాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఆహూతులను కట్టిపడేసింది. ఈ నృత్య ప్రదర్శనలు రెండు గంటలకు పైగా సాగాయి.

అలరించిన దుర్యోధన వధ



శ్రీరంగరాజపురం, జూలై 7: మండలంలోని చిల్లామాకుల పల్లె మహా భారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఆలయ ప్రాంగణంలో దుర్యోధనుడి బొమ్మను మట్టితో రూపొందించి పూజలు చేశారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు తెచ్చే సన్నివేశం భక్తులను ఆకట్టు కుంది. నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, నారాయణరెడ్డి, డిల్లర్ సుబ్రమణ్యంరెడ్డి, దేవేంద్రర్‌రెడ్డి, గురుస్వామిరెడ్డి, జయరాజ్, చిన్నబ్బ, ఏసు, గోవిందయ్య పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి


కార్మికుడితో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూలై 7: వర్షాకాలం నీటి ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముందని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని కమిషనర్ అరుణ తెలిపారు. ఆదివారం ఆమె టీటీడీ కల్యాణ మండపం పక్కనే ఉన్న టీఎస్ఆర్, గాయత్రి నగర్ చివరి పైపులైన్ వద్ద నీటికి క్లోరినేషన్ పరీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులను అరికట్టడానికి నీటి నాణ్యత తగ్గకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈలు వెంకటప్రసాద్, రమణ, ఏఈ లోకేష్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి రెస్ట్ రూమ్


రెస్ట్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 7: పోలీసు సిబ్బంది సౌకర్యార్థం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెస్ట్‌రూమ్, పార్కింగ్ షెడ్డును ఎస్పీ మణికంఠ ఆదివారం ప్రారంభించారు. సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా ఎన్నో ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి వారికి మంచి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఏఎస్పీ అరీఫుల్లా, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్ బాషా, ఇలియాజ్ బాషా, సీఐ విశ్వనాథరెడ్డి, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, ఏవో మోహన్ పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు


గొల్లకండ్రిగ దళితవాడలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

విజయపురం, జూలై 7: మండలంలోని సామిరెడ్డి కండ్రిగ పంచాయతీ గొల్లకండ్రిగ దళితవాడలో ఆదివారం సర్పంచ్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. వీధుల్లో నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించి, బ్లీచింగ్ పిచికారీ చేశారు. గొల్లకండ్రిగ, సామిరెడ్డికండ్రిగ గ్రామాల్లోనూ పారిశుధ్య చర్యలు చేపట్టారు.

రద్దీ రోడ్డులో మోడురాళ్లతో ఇబ్బందులు

గుడిపాల, జూలై 7: చిత్తూరు-వేలూరు(వయా గుడిపాల) రహదారిలో రాళ్ల వ్యర్థాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాలకు ఇదే ముఖ్యమైన రహదారి. 190 రామాపురంలో సీఎంసీ ఆసుపత్రి, గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలైకు ఈ మార్గంలోనే వెళ్లాలి. దీంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల రోడ్డు వెడల్పు చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా బ్రిడ్జ్ కింద కల్వర్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో తవ్వితీసిన మోడురాళ్లను దూరంగా తరలించకుండా రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో ఈ మార్గంలోని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో తప్పని తిప్పలు

విజయపురం, జూలై 7: కాలం చెల్లిన బస్సులతో తిప్పలు తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరి - కనకమ్మసత్రం రూట్‌లో పుత్తూరు డిపో నుంచి మూడు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. ఇవి ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి. సెలవు రోజులయితే బస్సు సర్వీసులు నడపడం లేదని ప్రజలు వాపోతున్నారు. బస్సులు తరచూ మరమ్మతులకు గురికావడం వలన ఇటు విద్యార్థులు, అటు ప్రయాణికులు సకాలంలో గమ్యం చేరుకోలేకపోతున్నారు. శనివారం విజయపురంలో నగరి - కనకమ్మసత్రం బస్సు ఆగిపోవడంతో తామే తోయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తెలిపారు.

వైభవంగా పొన్నియమ్మ తిరునాళ్ల



అంకమ్మకు పొంగళ్లు తీసుకెళుతున్న భక్తులు - ప్రత్యేక అలంకరణలో పొన్నియమ్మ

విజయపురం, జూలై 7: మండలంలోని మంగళంలో ఆదివారం పొన్నియమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఎల్లసముద్రం ఆదిఆంధ్రవాడలో మాతమ్మ తిరునాళ్లలో భాగంగా అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. మాతమ్మను పురవీధుల్లో ఊరేగించారు. ఆలపాకంలో అంకమ్మకు పొంగళ్లు పెట్టి రాత్రి పురవీధుల్లో ఊరేగించారు. బూచివానత్తం అంకమ్మ కాలనీలో గంగమ్మ తల్లికి భక్తులు అంబలి పోసి మొక్కు తీర్చుకున్నారు. ఒరూరులో గ్రామదేవతకు అంబలి పోసి, పొంగళ్లు పెట్టి భక్తులు మొక్కు తీర్చుకున్నారు.

జగన్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది : టీడీపీ

గంగాధరనెల్లూరు, జూలై 7: అధికారం కోల్పోయాక మాజీ సీఎం జగన్‌రెడ్డి తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ విమర్శించారు. అధికారంలో ఉన్నపుడు అన్ని వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని ప్రతిపక్షాలను వేధించిన ఆయన ఇప్పుడు నీతులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈవీఎంలను పగులగొట్టిన పిన్నెల్లిని మందలించాల్సింది పోయి సమర్థించడం ఏ మేరకు సబబో ఆలోచించుకోవాలన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పంచాయతీ రోడ్డు ఆక్రమణ



కార్వేటినగరం, జూలై 7: కార్వేటినగరం మచ్చువిలాసం వీధిలో రోడ్డు ఆక్రమణకు గురైంది. గతంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి మురికి కాలువ నిర్మాణం కోసం కొంత స్థలాన్ని వదిలిపెట్టారు. వారం రోజుల క్రితం కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించి, ఇనుప కంచె ఏర్పాటు చేశారు. స్థానికులు అభ్యంతరం చెప్పినా పట్టించుకునే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి రోడ్డు స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా కుంభాభిషేకం



పాలసముద్రం, జూలై 7: మండలంలోని తిరుమలరాజుపురం సిద్ధివినాయక, నాగాలమ్మ, రాధారుక్మిణి సమేత కృష్ణమూర్తిస్వామి భజన మందిరానికి ఆదివారం కుంభాభిషేక వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు పుష్యమి నక్షత్రం, కర్కాటక లగ్నములో శాస్త్రోక్తంగా కుంభాభిషేకం నిర్వహించారు. గణపతి హోమం, కలశపూజ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం వరసిద్ధి వినాయక ఉత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

జనసేన జెండా ఆవిష్కరణ



పాలసముద్రం, జూలై 7: మండలంలోని నరసింహాపురం పంచాయతీ టీఎస్ఆర్ పురం గ్రామంలో ఆదివారం జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోందన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల నష్టపోయిన రాష్ట్రం కోలుకునేలా చర్యలు చేపడుతోందన్నారు. జనసేన నాయకులు పవన్, పల్లవి, స్రవంతి రెడ్డి, రాజరత్నం రాజు, ప్రకాష్ రాజు, వెంకటేష్, యువరాజు, రాఘవ, భానుచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు

చిత్తూరు, జూలై 7: చిత్తూరు నగరంలో సోమవారం వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. ఉదయం 9.45 గంటలకు డీసీసీబీ బ్యాంకు ఆవరణలో, 10 గంటలకు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌కు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. 10.45 గంటలకు గుడిపాల మండలం శ్రీరంగంపల్లెలో సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

టీడీపీ బ్యానర్ చించివేత



పూతలపట్టు, జూలై 7: మండలంలోని రంగంపేట క్రాస్‌రోడ్డు వద్ద టీడీపీ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. రంగంపేట క్రాస్ రోడ్డు సమీపంలో పలు గ్రామాలకు చెందిన యువకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని చింపి ముళ్లచెట్లపై పడేశారు. దీనిపై టీడీపీ నేతలు సీఐ సుదర్శన్ ప్రసాద్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు.

మొగిలీశ్వరుడి సేవలో ఎస్పీ



బంగారుపాళ్యం, జూలై 7: మండలంలోని మొగిలీశ్వర స్వామిని ఎస్పీ మణికంఠ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు విశ్వనాథ గురుక్కళ్, గంగాధర గురుక్కళ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. బంగారుపాళ్యం ఎస్ఐ మల్లికార్జున ఆయన వెంట ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



బంగారుపాళ్యం, జూలై 7: మండలంలోని గుంతూరు పంచాయతీలో టీడీపీ వాణిజ్య విభాగ మండలాధ్యక్షుడు భాష్యం వంశీచౌదరి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. 400 మంది వైద్యం చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ లోకేష్ భరణి, సర్పంచ్ ద్రాక్షాయణి పాల్గొన్నారు.




నగరంలోని చిత్తూరు-పలమనేరు రోడ్డులో జోరుగా కురుస్తున్న వర్షం

చిత్తూరులో దంచికొట్టిన వాన

చిత్తూరు, జూలై 7: నగరంలో ఆదివారం సాయంత్రం జోరువాన కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత వాతావరణం చల్లబడింది. ఆరు గంటలకు తుంపర్లతో ప్రారంభమై మోస్తరు వర్షం కురిసింది. వర్షపు నీరు పల్లపు ప్రాంతాలైన పొన్నియమ్మన్‌గుడి వీధి, గురునాథ థియేటర్ రోడ్డు ప్రాంతాలకు రావడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మిట్టూరులో మురికికాల్వలు పూడిపోవడంతో వర్షపు నీరు వీధుల్లోకి వచ్చాయి. వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వీధులన్నీ బురదమయంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు సరిగా లేకపోవడం, గుంతల్లో నీరు నిలబడడంతో వాహనదారులు పడి గాయాలపాలయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిపై కార్పొరేషన్ అధికారులు ఆరా తీశారు.

పూతలపట్టు అభివృద్ధికి కృషి చేస్తా


అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 7: పూతలపట్టు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని గొడుగు చింత గ్రామంలో ప్రైవేటు కార్యక్రమానికి వచ్చారు. స్థానిక అమ్మవారి ఆలయంలో పూజలు చేయించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. అంతకు ముందు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు మధు, జయప్రకాష్, మంజునాథ, దాము, బాలు, శేషాద్రి నాయుడు, నేతాజి, యువరాజు, సుబ్రహ్మణ్యం, బాలయ్య పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా : గురజాల


పాళ్యంకొండ సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గురజాల

గుడిపాల, జూలై 7: ఎమ్మెల్యేగా గెలిపించినందుకు చిత్తూరు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం గుడిపాలలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. 197రామాపురంలో బీజేపీ జిల్లా నాయకుడు చిట్టిబాబు, టీడీపీ నేత హరి, జనసేన నేత చందు ఆధ్వర్యంలో నారగల్లు, కొత్తకోట తదితర ప్రాంతాల్లో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హామీలను దశలవారీగా నెరవేర్చుతానని తెలిపారు. పాళ్యంకొండ అభివృద్ధికి సహకరించాలని రిటైర్డు ఆర్మీ ఉద్యోగి జానకిరామ్ ఎమ్మెల్యేను కోరగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. నారగల్లులో జనసేన నాయకులు సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే గాంధీ, సీనియర్ నేత చెన్నకేశవుల నాయుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మాజీ జడ్పీటీసీలు బాలాజీ నాయుడు, సుమతి, నేతలు మురళీనాయుడు, రెడ్డెప్ప, చంద్రప్రకాష్, హేమలత, కవిత, ఉదయ, మధుసూదన్ నాయుడు, శంకర్ పాల్గొన్నారు.

చిత్తూరు ఎంపీకి సన్మానం



చిత్తూరు రూరల్, జూలై 7: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ మండల నేతలు ఆదివారం సన్మానించారు. లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి చిత్తూరు మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. టీడీపీ నేతలు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, జగదీష్‌నాయుడు, శోభన్‌బాబు, చల్లా, రమేష్ నాయుడు, గురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలో రాష్ట్రం బాగు


తెలుగు మహిళలతో రామానుజం చలపతి

నగరి, జూలై 7 : సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని విధాలా బాగుంటుందని టీడీపీ ఒకటో వార్డు మాజీ అధ్యక్షుడు రామానుజం చలపతి పేర్కొన్నారు. ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ లత ఆధ్వర్యంలో ఆదివారం సామాలమ్మ ఆలయ ఆవరణలో తెలుగు మహిళల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వార్డులో ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తెస్తే అధికారులను కలిసి పరిష్కరిస్తామని తెలిపారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



నగరి, జూలై 7 : స్థానిక పుదుపేట నాగదేవత ఆలయ కుంభాభిషేకం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహా పూర్ణాహుతి పూజలనంతరం ప్రధాన కలశాన్ని మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణగా తీసుకొచ్చారు. గర్భాలయ విమాన కలశానికి కుంభాభిషేకం చేశారు. కుంభాభిషేకం జలం కోసం భక్తులు ఎగబడ్డారు. శిఖరంపైకి వెళ్లి కలశాలపై పుష్పాలు చల్లి మొక్కుకున్నారు. అనంతరం గర్భాలయంలోని నాగదేవత ప్రతిమకు మహాభిషేకం చేశారు. అభిషేకానంతరం నాగదేవత ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేశారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి

బంగారుపాళ్యం, జూలై 7 : చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డు పక్కన వెళుతుండగా వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. అతని వయస్సు 65 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీ దగ్గుమళ్లకు స్వాగతం


దగ్గుమళ్లకు స్వాగతం పలుకుతున్న చిన్నస్వామి

గంగాధరనెల్లూరు, జూలై 7: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు గంగాధరనెల్లూరు మండలానికి చెందిన రిటైర్డ్ ఎస్పీ, టీడీపీ నేత పి.చిన్నస్వామి ఆదివారం రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సన్మానించారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

రొంపిచెర్ల, జూలై7: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ జాతర పురస్కరించుకొని ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి తెల్లవారుజామున 101 బిందెల పసుపు నీళ్లతో అభిషేకం, మహాభిషేకం, మంగళహారతులు, ప్రత్యేక పూజలు, పొంగళ్లు పెట్టి, పిండి దీ పారాధనలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని పుష్పపల్లకీపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

కల్లూరు, జూలై 7: పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో వైభవంగా మాతమ్మ అమ్మవారి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మాతమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి వివిధ రకాల పూజలు చేశారు. వేడుకల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా ప్రారంభమైన గంగ జాతర



రామకుప్పం, జూలై 7: రామకుప్పంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలో ప్రధాన అమ్మవారి ఆలయమైన దిగువ వీధి గంగమ్మ ఆల యం శివాజీ నగర్, రెడ్డివీధి, మాదిగ వాడ, రామ్ నగరం కాలనీ, కోదండ రామనగర్ కాలనీ, సల్లాపురమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. దిగువవీధి గంగమ్మ ఆలయంలో స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను పంచిపెట్టారు. అదేవిధంగా పట్టణంలో అన్ని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి.

నేడు అర్జున తపస్మాన్

కల్లూరు, జూలై 7: పులిచెర్ల మండలం మంగళంపేట భారతమిట్టలో కొనసాగుతున్న మహాభారతం ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ వేడుకలు నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

10న పుంగనూరులో మత్స్యకార దినోత్సవం

పుంగనూరు రూరల్, జూలై7: ఈ నెల 10వ తేదీన పుంగ నూరులో జరిగే మత్స్యకార దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బెస్త, మత్స్యకారులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీఎం ఎస్ క్లబ్ ఆవరణలో మత్స్యదినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా పుంగనూరు శ్రీవెంక టేశ్వర మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగింద న్నారు. తమకు బడ్జెట్ కేటాయిం చలేదని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. జగన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. పుంగ నూరులో చెరువులు కబ్జాచేసి మత్స్యసంపద ఉత్పత్తి లేకుండా చేశారని, మత్స్యకార భరోసా ఇవ్వకుండా మోసంచేశారని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రా రెడ్డిని ఆహ్వానించామని తెలిపారు. నియోజకవర్గంలోని మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు కామేశ్వర, దొరస్వామి, ప్రకాశ్, నగేశ్,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ,


గంగమ్మ గుడి వద్ద పిండిదీపాలు వెలిగిస్తున్న మహిళలు

గుడుపల్లె, జూలై 7: మండల పరిధిలోని పెద్దగొల్లపల్లె గ్రామంలో గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం గంగమ్మ ఆలయంలో అమ్మవారి మూల విగ్రహానికి పూజారులు అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మహిళలు పిండిదీపాలతో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా రాళ్ల గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత పొంగళ్లు పెట్టి, పిండిదీపాలు వెలిగించి కర్పూర హారతులు పట్టారు. అనంతరం జంతు బలులు ఇచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, చెరువులు నిండాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.